# జైహింద్
## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

1944, ఏప్రిల్...

తమని సుబాస్ చంద్ర బోస్ పిలిపించాడని తెలిసి ఒక పక్క ఎంత ఆశ్చర్యం కలిగిందో, మరో పక్క అంతే సంకోచం కూడా కలిగింది 'పాంచ్ పటాకా' గ్రూపుకు.

"మేడం, మీరు కూడా రండి మేడం..." అని విషయం చెప్పిన కెప్టెన్ లక్ష్మిని బ్రతిమలాడుకున్నారు.

"ఆయన పిలిచింది మిమ్మల్ని. నన్ను కాదు..." అంది కెప్టెన్ లక్ష్మి. "మీరు శిక్షణ పొందిన సైనికులు. మీ సుప్రీం కమాండర్‌ని కలవబోతున్నందుకు ఆనందించాలి కానీ, భయపడకూడదు..." అంటూ ధైర్యం చెప్పి వారిని పంపింది.

ఒంటరిగానే ఆయన ముందుకు వెళ్లక తప్పలేదు వారికి. ఆయన కనపడగానే అందరు ఒక వరుసలో నిలబడి స్టిఫ్‌గా సెల్యూట్ చేశారు.

"మిమ్మల్ని ఒక కోరిక కోరటానికి పిలిచాను..." అన్నాడు బోసు ఏ ఉపోద్ఘాతం లేకుండా.

"వుయ్ ఆర్ ఎట్ యువర్ సర్వీస్ సర్..." ఉమ్మడిగా అన్నారు వారు.

వారిని ఒకరి తరువాత ఒకరుగా పరీక్షగా చూస్తున్న ఆయన చూపులు ఫ్లోరెన్స్ మీద ఆగిపోయాయి.

ఆయన చూపులోని ప్రశ్నను అర్థం చేసుకున్న మధుబాల, "ఆ అమ్మాయి పేరు ఫ్లోరెన్స్ సర్. బ్రిటిషర్..." అని చెప్పింది.

"మిగిలిన వాళ్లు ఇక్కడ ఎందుకు ఉన్నారో నేను అర్థం చేసుకోగలను. కానీ నువు ఈ గ్రూపులో ఉండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియటం లేదు..." అన్నాడాయన సూటిగా ఫ్లోరెన్స్‌ను చూస్తూ.

ఫ్లోరెన్స్ ఏమి సమాధానం చెప్పాలా అని కొన్ని క్షణాలు ఆలోచించింది. అంతటి నాయకుడి ముందు నిలబడి అబద్ధం చెప్పలేనని అర్థం చేసుకుని ఉన్నది ఉన్నట్లు చెప్పటానికి తయారయింది. "నిజానికి నేను, డోల్మా కోహిమాలో ఒక లక్ష్యం, ధ్యేయం లేకుండా తిరుగుతుండేవాళ్లం. మా నాన్న రాయల్ ఎయిర్‌ఫోర్స్‌లో ఒక ఉద్యోగి. ఆయన ఇచ్చిన చనువును అలుసుగా తీసుకుని సాహసం అనుకుని దుస్సాహసం చేసి ఇక్కడకు వచ్చి పడ్డాం. ఎదురయిన ప్రమాదం నుండి తప్పించుకోవటానికి ఆజాద్ హింద్ ఫౌజులో చేరాం. అప్పటికి మాకు మీరు చేస్తున్న పోరాటపు ఔన్నత్యం కానీ, దాని అవసరం కానీ తెలియదు. నెమ్మదిగా మాకు మిగిలిన ముగ్గురితో పరిచయం అయింది. భారతదేశ చరిత్రను, దానికి జరిగిన అన్యాయాన్ని ఇక్కడే తెలుసుకున్నాను. పుట్టుకతో బ్రిటిషు దేశస్తురాలినయినా, భారతదేశం మీద సానుభూతి ఏర్పడింది."

"కావొచ్చు. రేపు అవసరం అయితే మా తరుపున నిలబడి మీ నాన్నని కాల్చగలవా?" సూటిగా అడిగాడు బోసు.

ఫ్లోరెన్స్ సమాధానం చెప్పటానికి తడుముకుంది.

"ఈ అమ్మాయిని కోహిమాలో వెదిలెయ్యండి. ఇకపోతే మీ నలుగురినీ నేను కోరదలచుకున్న కోరిక ఏమిటంటే నాకు మీ ప్రాణాలు కావాలి..." అన్నాడాయన.

"మేం తయారుగా ఉన్నాం సర్." అన్నారు నలుగురు ఉమ్మడిగా.

"పోరాటంలో అత్యంత క్లిష్ట దశ వచ్చేసింది. ఈ దశలో విజయానికి, అపజయానికి మధ్య ఉండే తేడా ఏమిటంటే చావు భయం. ఎవరిలో ఆ భయం లేదో వారు జయిస్తారు. అందునా మనలాంటి విప్లవ సైన్యానికి పెద్దగా ఆయుధాలు ఉండవు. సాధన సంపత్తి ఉండదు. మరి మనం శత్రువు మీద ఎలా గెలవగలం?"

వారెవరూ మాట్లాడలేదు.

"ముందే చావుతో సహజీవనం చేసే వారిని అది భయపెట్టదు. చావు భయం లేని వాడిని ఏ ఆయుధమూ ఆపలేదు. మీరందరూ అలాంటివారని కెప్టెన్ లక్ష్మి చెప్పింది. నిజమేనా?"

"నిజమే సర్..."

"కలకత్తా, కోహిమాలో ఉన్న మన గూఢచారులు బ్రిటిషు సైన్యం ఇంఫాల్, కోహిమాల నుండి వెనక్కి మరలిందని చెప్తున్నారు. అందులో ఏదో మోసం ఉందని నాకు అనిపిస్తోంది. మీరు ఆడవారు కాబట్టి అంతగా అనుమానించరు. ఎలా అయినా నిజం తెలుసుకోండి. మీరు చేరవేసే సమాచారం ఆధారంగా సైన్యాన్ని దాడికి ఎప్పుడు పంపాలో నేను నిర్ణయం తీసుకుంటాను..."

"సరే సర్..."

"మిమ్మల్ని మృత్యువు నోట్లోకి పంపిస్తున్నానని తెలుసు. మీరు ప్రాణాలతో వెనక్కి వచ్చే అవకాశం తక్కువనీ తెలుసు. అయినా నాకు మరో మార్గం లేదు. అలా అని నాకు విచారం కూడా లేదు. దేశం కోసం ప్రాణాలు అర్పించటానికి

మించిన గౌరవం ఇంకేమీ ఉండదని నేను నమ్ముతాను. ఆ అవకాశం అందరికంటే మీకు ముందుగా వచ్చినందుకు అభినందనలు…” అంటూ సమావేశం ముగించాడు బోసు.

“అర్థమయింది సర్…” అని మరోసారి సెల్యూట్ చేశారు వారు.

అర్ధరాత్రి అవుతోంది. జపాను ట్రాన్స్‌పోర్ట్ విమానం తయారుగా ఉంది. నలుగురు క్రూ మెంబర్లు తయారుగా ఉన్నారు. ఒక పైలెట్, కో–పైలెట్, నావిగేటర్, రేడియో ఆపరేటర్ ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు.

క్యాబిన్‌లో సీట్లు లేవు. కిటికీలు లేవు. ఒక ఇరుకు గదిలా ఉంది. అయిదుగురు అమ్మాయిలు అందులోకి ప్రవేశించారు.

విమానం బయలుదేరుతుందనగా ఆజాద్ హింద్ ఫౌజ్ అధికారి ఒకతను వచ్చాడు. అందరికీ తలా ఒక రివాల్వరు, కొన్ని తూటాలు ఇచ్చాడు. కలకత్తాలో, కోహిమాలో ఉన్న ఏజెంట్ల వివరాలు ఇచ్చాడు. వారిని ఎక్కడ కలుసుకోవాలో, ఎలా కలుసుకోవచ్చో వివరించాడు. “మీ వివరాలు కూడా వారికి తెలియచేశాం. ఏ సహాయం కావాలన్నా వారిని అడగండి…” అని చెప్పాడతను. విమానం దిగబోతూ, ఒకసారి వారి వంక దీక్షగా చూసి, “భయం వేస్తుందా?” అని అడిగాడు.

“లేదు, ఎగ్జయిట్‌మెంట్‌గా ఉంది…” చెప్పింది డోల్మా.

అతను నిట్టూర్చాడు. ‘వీళ్లకు తాము ఎంతటి ప్రమాదంలోకి వెళ్లబోతున్నారో అర్థం కావటం లేదు…’ అనుకున్నాడతను.

అతను బయటకు వెళ్లాక విమానం బయలుదేరింది.

కేవలం అరగంటలో బర్మా– ఇండియా సరిహద్దుల్లోకి చేరింది విమానం. పగటి పూట కంటే, రాత్రి పూట విమానం నడపటంలో ప్రమాదం ఎక్కువ. అయినా ఇలాంటి రహస్య ఆపరేషన్లు రాత్రి పూటే చెయ్యాలి.

సరిహద్దుల్లో బ్రిటిషు దళాలు ఎక్కడెక్కడ ఏంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్ మోహరించారో తెలియదు. శత్రువు రాడార్‌కి దొరక కూడదని విమానాన్ని అతి తక్కువ ఎత్తులో ఎగిరిస్తున్నాడు పైలెట్. నావిగేటర్ ఒక పెద్ద మ్యాపు ముందు పరచుకుని ఎక్కడెక్కడ కొండలు, గుట్టలు ఉన్నాయో గుర్తించే పని చేస్తున్నాడు.

ఎట్టకేలకు విమానం బర్మా దేశపు సరిహద్దులు దాటి భారతదేశంలోకి ప్రవేశించింది.

చిమ్మచీకటిలో పరిసరాలు కనిపించే అవకాశమే లేదు. నావిగేటర్ మైకులో వెనుక కూర్చున్న అయిదుగురు అమ్మాయిలకు తయారుగా ఉండమని సూచన ఇచ్చాడు.

పారాచూట్లు వీపుకు తగిలించుకుని కిందకు దూకటానికి సన్నద్ధంగా ఉన్నారు వారు. వారిలో ఎవరికీ భయం లేదు. వారి కళ్ల ముందు బంధనాలు తెంచుకోబోతున్న దేశమాత కనిపిస్తోంది. ఫ్లోరెన్సు మాత్రం తన తండ్రిని తిరిగి కలుసుకోవచ్చన్న ఆనందంతో ఉంది.

క్యాబిన్ తలుపు తెరచుకుంది.

"బెస్టాఫ్ లక్..." అని చెప్తున్న నావిగేటర్ మాటలు పూర్తిగా వినకుండానే కిందకు దూకేసింది డోల్మా. మిగిలిన నలుగురు ఆమెను అనుసరించారు.

సర్రున గాలిని చీల్చుకుంటూ కిందకు పడుతున్నారు వారు. దుస్తులను ఛేదించుకుని లోపలకు ప్రవేశిస్తున్న చలి గాలులు శరీరాన్ని సన్నటి కత్తితో కోస్తున్నట్లు బాధ కలిగిస్తున్నాయి.

విమానం తక్కువ ఎత్తులో ఎగురుతోంది కాబట్టి పారాచూట్లు తెరవటానికి ఎక్కువ సమయం తీసుకోలేదు. పారాచూట్ తెరవగానే, కిందకు పడిపోతున్న వారి శరీరాలు ఒక్కసారిగా జర్క్‌తో నెమ్మదించాయి.

ఇప్పుడు అవి తెగిన గాలిపటాల్లా నెమ్మదినెమ్మదిగా కిందకు వస్తున్నాయి. చీకట్లో మరింత నల్లగా మెరుస్తూ ఒకరికి మరొకరి ఉనికిని తెలుపుతున్నాయి.

నేలకు చేరువయ్యాక ఒకరికొకరు దూరం అయ్యారు. లేకపోతే ఒకరికొకరు గుద్దుకునే ప్రమాదం ఉంది.

కిందకు దిగిన వారు తమతమ పారాచూట్లను పోగుచేసి నేలలో ఒక గొయ్యి తీసి గోతిలో పాతి పెట్టారు. అలా చేయకపోతే, కింద పడిన పారాచూట్ శత్రు సైనికులకు కనిపించిన పక్షంలో తాము వచ్చిన విషయం వారికి తెలిసి పోతుంది. అందుకే పారాచూట్‌ని ఉపయోగించి శత్రు దేశంలో దిగిన సైనికుడు మొదట చేయవలసిన పని పారాచూట్ ఎవరి కంటా పడకుండా చూడటం.

పది నిమిషాల్లో ఆ పని పూర్తయింది. చుట్టూ తిరిగి ఒకరినొకరు చూసుకుంటే చేవా ఒక్కతే కనపడ లేదు. ఆమెను వెతుకుతూ వెళ్లిన వారికి దూరంగా చెట్టు మీద నుండి బ్యాటరీ లైటు వేసి తమ దృష్టిని ఆకర్షించటానికి ప్రయత్నిస్తున్న చేవా కనిపించింది.

చేవా ఉన్న పారాచూట్ చెట్టు ఎత్తుగా ఉన్న కొమ్మలకు చిక్కుకుంది. దానితో ఆమె చాలా ఎత్తున గాలిలో వేలాడుతోంది.

మిగిలిన వారంతా కలిసి ఆమెను కిందకు దించారు.

"ఇది ఏ ప్రదేశమో, కోహిమాకు ఎంత దూరంలో ఉన్నామో ఏమయినా అర్థమవుతుందా డోల్మా?" అడిగింది కాంచనమాల.

డోల్మా ఒక పెద్ద చెట్టును అవలీలగా ఎక్కి పరిసరాలు గమనించి దిగి వచ్చింది. "మనం కోహిమాకు ఎంతో దూరంలో లేము. రెండు గంటల్లో వెళ్ళగలము..." చెప్పింది డోల్మా.

“గ్రేట్. ఇంత చీకట్లో కూడా చిటుక్కున ఈ ప్రదేశం ఏమిటో కనిపెట్టగలిగావే…” అంది చేవా.

“తను ఈ అడవుల్లో తిరిగేదే రాత్రి పూట. తనకు ఇదేమీ గొప్ప విషయం కాదు.” అంది డోల్మాని మెచ్చుకుంటూ ఫ్లోరెన్స్.

అందరూ కలిసి తరువాత ఏం చేయాలో ఆలోచించుకున్నారు. “ముందు కోహిమా వెళ్ళి మన ఏజెంటును కలుసుకోవాలి. ఆ తరువాత ఏం చేయాలో అతను చెప్పే మాటలను బట్టి ఆలోచించుకుందాం…” అంది కాంచనమాల.

“అవును…” అంది మధుబాల. “అందరం మూడు గంటలు విశ్రాంతి తీసుకుందాం. తెల్లవారుజామున లేచి కోహిమా వెళ్దాం. అప్పటివరకు నలుగురు నిద్ర పోతుంటే ఒకరు వంతులవారీగా కాపలా ఉందాం…” అంది.

అనుకున్నట్లే నిద్ర పోయి లేచి, ముందే తెచ్చుకున్న నాగా సాంప్రదాయ బట్టలు వేసుకున్నారు. కోహిమాలో ఆడపిల్లలు వేసుకునే బట్టలు తెగలను బట్టి మారతాయి. మెడ కింద నుండి, మోకాళ్ళ దిగువ వరకు శరీరానికి చుట్టినట్లు ఉండే ముదురు రంగు వస్త్రాలు వేసుకుంటారు. అలా వేసుకోని వారందరినీ పరాయి వాళ్లగానే చూస్తారు అక్కడ. ఫ్లోరెన్స్ తప్ప మిగిలిన నలుగురు ఆ డ్రస్‌లోకి మారిపోయారు. ఫ్లోరెన్స్ మాత్రం ఖాకీ ప్యాంటు, తెల్ల షర్టు వేసుకుంది.

వాళ్లు కాలినడకన కోహిమా చేరుకున్నారు. “ఇక్కడ నుండి మనం అయిదుగురం ఒక చోట ఉండటం మంచిది కాదు…” చెప్పింది మధుబాల.

“ఎలానూ ఫ్లోరెన్స్ వాళ్ల ఇంటికి వెళ్ళి పోతుంది. మిగిలిన నలుగురం ఇద్దరిద్దరుగా విడిపోదాం. నేను, డోల్మా మన గూఢచారి అచింత్‌ని కలుసుకోవటానికి వెళ్తాం. కాంచనమాల, చేవా మాకు బ్యాకప్‌గా ఉంటారు…” చెప్పింది మధుబాల.

“నాకు మిమ్మల్ని వదిలి వెళ్లాలని లేదు…” బాధగా అంది ఫ్లోరెన్స్.

“ఒకసారి మీ నాన్నని చూశాక ఈ బాధ మరచిపోతావ్‌లే…” అంటూ ఆమె భుజం మీద ఓదార్పుగా చెయ్యి వేసింది మధుబాల.

“మనల్ని అందరు ‘పాంచ్ పటాకా’ అనే వాళ్ళు. ఇప్పుడు నలుగురం అయిపోతున్నాం…” అంది బాధగా ఫ్లోరెన్స్.

“డోంట్ వర్రీ! ఇది మా పోరాటం. ఈ పోరాటం పూర్తయ్యేటప్పటికి ఎంత మందిమి మిగులుతామో కూడా తెలియదు. నువు హాయిగా మీ నాన్నదగ్గరకు వెళ్ళు. తరువాత నీ కుటుంబాన్ని కలుసుకో. హాయిగా భావి జీవితాన్ని గడుపు…” చెప్పింది మధుబాల.

“మన ఏజెంట్ అచింత్ ఎక్కడకు వస్తానన్నాడు?” అడిగింది కాంచనమాల మాట మార్చటానికి.

“కోహిమా గ్రౌండ్‌లో ఇవాళ ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతోంది. అక్కడయితే ఎవరూ ఎవరినీ పట్టించుకోరు కాబట్టి, అక్కడ కలుసుకుందాం అన్నాడంట…” చెప్పింది మధుబాల.

“నిజమే!… అంత మంది జనం మధ్య మనల్ని ఎవరు పట్టించుకుంటారు?” అంది డోల్మా.

కలనల్ వార్నర్ కోడ్ బుక్ సంపాదించాక ఒక్క కలకత్తాలోనే కాదు, దేశం నలుమూలల నుండి రేడియో ద్వారా వార్తలు చేరవేస్తున్న ఆజాద్ హింద్ ఫౌజు గూఢచారులను బ్రిటిషు ప్రభుత్వం తేలికగా ట్రాక్ చేయగలుగుతోంది. ఇప్పుడు వారిని పట్టుకోవటం మీద కంటే, వారు ఏ వార్తలు పంపుతున్నారో తెలుసుకునే కార్యక్రమం మీదే తమ ధ్యాస అంతా నిలిపారు.

కానీ ఇప్పటికీ బ్రిటిషు వారికి ఉన్న ఒక చిన్న అసౌకర్యం ఏంటంటే, ఆజాద్ హింద్ ఫౌజ్ హెడ్క్వార్టర్ నుండి ఏజంట్లకు వచ్చే వార్తలను డీకోడ్ చేయలేక పోతున్నారు. ఏజంట్లు హెడ్క్వార్టర్‌కు పంపే వార్తలను మాత్రం తెలుసుకోగలుగుతున్నారు.

అలాంటి సమయంలో కోహిమా నుండి అచింత్ పంపిన వార్తను ఫోర్ట్ విలియమ్‌లోని కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం డీకోడ్ చేసి కలనల్ వార్నర్ ముందు ఉంచారు.

“ఫుట్‌బాల్ మ్యాచ్ సమయంలో కలుసుకుంటాడా? ఎవరిని?” అడిగాడు వార్నర్.

“తెలియదు సార్. అటు నుండి వచ్చిన మెసేజ్ మనకు తెలియదు. ఇతను మాత్రం ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతున్నపుడు కలుసుకుందాం అని కబురు పంపాడు…”

కాసేపు వార్నర్ ఆలోచిస్తూ ఉండి పోయాడు. “మనం మన సైనికులను ఉపసంహరించుకుంటున్నామని వారికి తెలిసేలా చేశాం కదా. అందులో ఎంత నిజం ఉందో తెలుసుకోవటానికి హెడ్క్వార్టర్ నుండి ఎవరినో పంపి ఉంటారు. వారిని ఈ ఏజెంట్ ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా కలుసుకోబోతున్నాడు…” చెప్పాడు అతను.

“మరి ఏం చెయ్యమంటారు?”

“అందరినీ అరెస్ట్ చెయ్యండి.” చెప్పాడు వార్నర్. “లోకల్ ఏజెంట్ కంటే బయట నుండి వచ్చిన వారు ముఖ్యం. వారిని ఇంటరాగేట్ చేస్తే అటు విషయాలు మనకు తెలుస్తాయి. కాబట్టి అందరినీ ప్రాణాలతో పట్టుకోవటానికి ప్రయత్నించండి. ఒకవేళ కుదరక పోతే చెయ్యగలిగింది ఏమీ లేదు. షూట్ దెమ్…” అంటూ ఫైనల్ ఆర్డర్ ఇచ్చాడు వార్నర్.

ఫ్లోరెన్స్ నడుచుకుంటూ ఇంటిని సమీపిస్తుంటే ఆమె కాళ్లు వణుకుతున్నాయి. ఆ రోజు విమానాన్ని దొంగలించటం అన్న తన నిర్ణయం, తనను ఇన్ని రోజులు తండ్రికి దూరం చేస్తుందని ఆ పని చేస్తున్నపుడు ఆమె భావించ లేదు. యుక్త వయసులో అందరి పిల్లల్లో ఉన్నట్లే ఆమెకు ఆరాటం ఎక్కువ, ఆలోచన తక్కువ.

తండ్రి తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని తను ఎలా వమ్ము చేసిందో తలచుకుంటుంటే ఆమెకు ఏడుపు వస్తోంది. కుటుంబాన్ని చూడటానికి బ్రిస్టల్ వచ్చిన తండ్రిని తనను కూడా ఇండియా తీసుకు వెళ్ళమని అడిగినపుడు ముందు ఆయన

ఒప్పుకోలేదు. అయినా తను పంతం వీడలేదు. బ్రతిమలాడింది, బెదిరించింది. ఆఖరికి తండ్రిని ఒప్పించింది. తన కోసం తండ్రి ఎన్నో కష్టాలు పడ్డాడు. తను అడిగిన ప్రతిదీ ఇచ్చాడు. అయినా తను తండ్రిని మోసగించింది.

ఇంతలో ఇంటికి చేరువయింది ఆమె. తండ్రి ఈ సమయంలో ఇంట్లో ఉంటాడో, ఉండడో అని అనుమానిస్తూనే తలుపు మీద కొట్టింది.

లోపల నుండి ఎవరిదో అడుగుల శబ్దం వినిపించింది. కాసేపటికి తలుపు తెరచుకుంది. ఎదురుగా ఎవరో బ్రిటిషు మధ్యవయస్కురాలు ఉంది. "ఎవరు కావాలి?" అని అడిగింది.

"మింటో లేరా?"

"నీవెవరు? ఆయనతో నీకు ఏం పని?"

"నా పేరు ఫ్లోరెన్స్. మింటో గారి అమ్మాయిని..."

"ఓ గాడ్! నువ్వేనా ఫ్లోరెన్స్ అంటే. కమాన్! లోపలకు రా..." అని ఫ్లోరెన్స్‌ను లోపలకు ఆహ్వానించింది ఆమె. "నేను అల్బర్ట్ భార్యని. నా పేరు సోఫియా. ఇంతకీ నీకు అల్బర్ట్ గుర్తున్నాడా? మీకు టైగర్‌మోత్ చూపించిన ఇంజినీర్..." అంది ఆమె.

"అయామ్ సారీ! నా మూలంగా మీ అందరికీ కష్టం వచ్చి ఉంటుంది..." లోపలకు వస్తూ అంది ఫ్లోరెన్స్. తమ సామాను ఏమీ ఆ ఇంట్లో లేవు. అన్నీ వేరే సామాన్లే ఉన్నాయి. ఒక సోఫాలో కూర్చుంటూ, "ఇంతకీ మా నాన్న ఎక్కడ ఉన్నాడు?" అని అడిగింది ఫ్లోరెన్స్.

"నువు చేసిన పనికి మీ నాన్నను కోర్ట్ మార్షల్ చేశారు. ఉద్యోగం నుండి తీసి వేయటమే కాకుండా, ఆరు నెలల జైలు శిక్ష విధించారు. అది పూర్తయిన తరువాత మీ నాన్న బ్రిస్టల్ వెళ్లిపోయాడు..." చెప్పింది సోఫియా.

అనుకున్నదే అయినా తన వలన తండ్రికి వచ్చిన కష్టం విని మరోసారి కన్నీళ్లు పెట్టుకుంది ఫ్లోరెన్స్. సోఫియా ఆమెను దగ్గరకు తీసుకుని ఓదార్చింది.

"మరి అల్బర్ట్ గారు ఎలా ఉన్నారు? ఆయనకు ఇబ్బంది ఏమీ కలగ లేదా?"

"ఆయన్ని కూడా కోర్ట్ మార్షల్ చేశారు. కానీ, తప్పంతా మీ నాన్న గారు తన మీద వేసుకోవటంతో మూడు నెలల శిక్ష తరువాత తిరిగి ఉద్యోగం ఇచ్చారు."

"నా వలన మీ అందరికీ కష్టం వచ్చింది..." బొంగురు గొంతుతో అంది ఫ్లోరెన్స్.

"పరవాలేదు. నిజానికి నువ్వు, నీతో పాటు ఉన్న మరో అమ్మాయి జీవించి ఉన్నారని ఎవరూ అనుకోవటం లేదు. మీ నాన్న కూడా నీ మీద ఆశలు వదిలేసుకున్నాడు. విమానాన్ని ఎగిరించటం సాధ్యమయినా, దానిని దించటం అంత తేలిక కాదంటగా. దిగేటపుడు ఏ చెట్టుకో, పుట్టకో గుద్దుకుని మరణించి ఉంటారని అనుకున్నారు." అంటూ అప్పటి

విషయాలు చెప్పింది సోఫియా. "ఎప్పుడనగా తిన్నావో, నువు స్నానం చేసిరా. బ్రేక్‌ఫాస్ట్ చేద్దువు గాని..." అంటూ ఫ్లోరెన్స్‌ని ఒక రకంగా బలవంతంగా బాత్‌రూమ్‌లోకి పంపింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS